క్లుప్తంగా

పక్కాగా వేలంపాట

వీరఘట్టం: ఈ నెల 13న జరగనున్న పంచాయతీ షాపుల వేలంపాటను పక్కాగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని వీరఘట్టం మేజర్ పంచాయతీ ఈఓ రాము సూచించారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటిపన్ను వసూలు వేగవంతం చేయాలన్నారు. అలాగే పారిశుధ్య పనులను సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: మండలంలో నవగాం 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారి టీజీకే మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పాట్టిలి, ఎం.సింగుపురం, మల్లివీడు, డోలమడ, బద్దుమాసింగి, జంపరకోట, అవలంగి, పనుకువలస, టీకే.రాజపురం, అట్టలి, తుమరాడ, చింతాడ, వాటపాగు, బెజ్జి, టీడీ పారాపురం, దుగ్గి, ఎన్.పారాపురం పంచాయతీల్లో సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మలేరియా నిర్మూలన చర్యలు చేపట్టాలి

సీతంపేట: మలేరియా నిర్మూలనా చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దోమతెరల సరఫరా, మెడికల్ క్యాంపులు నిర్వహించి గిరిజనులను ఆదుకోవాలని పేర్కొన్నారు. సీతంపేట ఏరియా ఆస్పత్రిలో తగినన్ని బెడ్‌లు లేక రోగులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలేరియా నిర్మూలనకు చర్యలు చేపట్టి ప్రజలను ఆదుకోవాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

వీరఘట్టం: మండలంలోని సర్కారు బడుల్లో చదివిన 19 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారని ఎంఈఓలు ఆర్.ఆనందరావు, డి.గౌరినాయుడు తెలిపారు. గురువారం వీరు విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థుల వివరాలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. తలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన మజ్జి రాకేష్, తాడేల సాయి రణ్య, కొరికాన వాగ్దేవి, అల్లు యోగిత, దేవకివాడ ఉమామహేశ్వరరావు, వావిలపల్లి జ్ఞానేశ్వరి, తాడేల సాయిగాయత్రి, దేవకివాడ కావ్యశ్రీ, శిర్లి సాయిగణేష్.. నీలానగరం హైస్కూల్‌కు చెందిన దుప్పాడ సంజన, ఎస్.చరణ్, బుగత రేవతి, బొత్స రామలక్ష్మి, కె.సోమశేఖరరావు, పి.ఈశ్వరి.. తెట్టంగి హైస్కూల్‌కు చెందిన బి.నీరజ, సీహెచ్ ఈశ్వరలక్ష్మి.. రేగులపాడు కేజీబీవీకి చెందిన యెడ్ల మాధురి.. గంగమ్మపేట ఆశ్రమ పాఠశాలకు చెందిన కూరంగి రోహిత్ ఎంపికయ్యారన్నారు. వీరికి పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పత్రి కృష్ణమూర్తి, తదితరులు అభినందించారు.

ముగ్గురు విద్యార్థులు..

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ ఆర్.శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుబిల్లి లావణ్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి.. గుడ్ల సాయిలక్ష్మి, మండల భవ్యశ్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

కురుపాం: తాజాగా విడుదలైన ట్రిపుల్ ఐటీ ఫేజ్-1 ఫలితాల్లో కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో ఎన్.సత్యనారాయణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి వడ్డి అనూష, బిడ్డిక భావన(నూజివీడు), సాలూరు స్వాప్నిక, గ్రంధి కృపాజ్యోతి(శ్రీకాకుళం), ఆలిబిల్లి గాయత్రి(ఒంగోలు) ఎంపిక కాగా, స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన వై.యోషిత(ఒంగోలు), కె.జనని(శ్రీకాకుళం) ఎంపికైనట్లు పేర్కొన్నారు. సదరు విద్యార్థులను సిబ్బంది అభినందించారు.

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కర్రి నిషిత, వసంతల చాందిని, జియ్యమ్మవలస ఉన్నత పాఠశాల నుంచి బర్లి పవిత్రలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ఎంఈవో-2 శ్రీనివాసరావు తెలిపారు.


కొమరాడ: మండలంలోని మాదలింగి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్.నాగేశ్వర్ తెలిపారు. ఎంపికైన వారిలో పండా హేమంత్‌కుమార్, తెర్లి సాహితి, శంబంగి చాందిని, పల్లెరుక స్వప్న ఉన్నారు.

వర్క్‌షాపును విజయవంతం చేయండి

పాలకొండ రూరల్: రాష్ట్ర భవిష్యత్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్, రూల్ ఆఫ్ లా అమలు కావాలంటే న్యాయవాదులు, మేధావులు మరింత సంఘటితం కావాలని న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యుడు మరిచర్ల జగన్‌మోహనరావు కోరారు. ఈ నెల 27న కాకినాడ 'డీ' కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న 17వ రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు, మేధావుల వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వర్క్‌షాప్‌నకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం స్థానిక కోర్టు ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వరరావు, టి.సింహాచలం, ఎం.కిరణ్‌కుమార్, వై.అఖిల్ ప్రకాష్ పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ఒక్కరికే..!

తల్లికి వందనం పథకంపై చంద్రబాబు సర్కారు యూ టర్న్ తీసుకుంది. ఎన్నికల ప్రచార సమయంలో పాఠశాలకు వెళ్లే పిల్లలు ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు అదే హామీకి తూట్లు పొడిచేలా జీవో నంబర్ 29 జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పథకం అమలుకు ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం ఒక్కో తల్లికి ఏడాదికి రూ.15 వేలు జమచేస్తామని పేర్కొన్నారు. ఈ లెక్కన ఒక ఇంట్లో ఒక బిడ్డకు మాత్రమే పథకం డబ్బులు ఇస్తారన్న విషయం స్పష్టం కావడంతో విద్యార్థుల తల్లులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రూ.45 వేలు వస్తాయని ఆశపడ్డాం



ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అందరికీ తల్లికి వందనం పేరిట డబ్బులు ఇస్తారని ఆశ చూపారు. నాకు ముగ్గురు పిల్లలు. మల్లి ఆశ్రమపాఠశాలలో చిన్నకుమారుడు అనిల్‌కుమార్ ఐదోతరగతి, సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో దీనా ఏడో తరగతి, గోపాలపురం మౌంట్‌ఫోర్ట్ పాఠశాలలో పెద్దమ్మాయి మౌనిక 8వ తరగతి చదువుతోంది. ఇద్దరు ఆడపిల్లలకు కలిపి రూ.30 వేలు, కుమారునికి రూ.15 వేలు వస్తాయనుకున్నాం. ఇప్పుడు కేవలం ముగ్గురిలో ఒకరికే ఇస్తామనడం విడ్డూరంగా ఉంది.
– ఎస్.అరుణ, టిటుకుపాయి, సీతంపేట మండలం

ఆశగా చూస్తున్నాం..



ప్రభుత్వం ఇచ్చే తల్లికి వందనం పథకం కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. గత ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభం కాగానే పథకం డబ్బులు వేసేది. ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇంకా పథకం అమలుకు ముందుకు రాలేదు. ఎన్నికలప్పుడు ఎంతమంది చదివితే అంతమందికి ఇస్తామని, ఇప్పుడేమో ఒక్కరికే ఇస్తామనడం మోసంలా ఉంది. మా ఇంట్లో ముగ్గురు పిల్లలున్నారు.. రూ.15 వేలు చొప్పున ముగ్గురికి రూ.45 వేలు వస్తాయనుకున్నాం. చూడాలి ఆఖరికి ఎలా ఇస్తారో.
–హెచ్.శిరీష, గుంజరాడ, కురుపాం మండలం.

ఇద్దరికీ వస్తుందనుకున్నాం..



మా ఇంట్లోని ఇద్దరు పిల్లలూ ప్రభుత్వ బడిలోనే చదువుతున్నారు. ఇద్దరికీ తల్లికి వందనం పథకం వస్తుందనుకున్నాం. గతంలో జూన్‌లోనే పథకం డబ్బులు ఇచ్చేవారు. ఇప్పుడు జూన్ నెల దాటినా ఇంతవరకు పథకం అమలు చేయలేదు. ఏడాదికి రూ.30 వేలు వస్తాదని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాం. –ఆర్.సోమేశ్వరి, వెంకటరాజపురం, జియ్యమ్మవలస మండలం.

ఫీజులెలా కడతాం..



ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలను చదివిస్తే అందరికీ రూ. 15 వేలు చొప్పున అందజేస్తామన్నారు. వారి మాట నమ్మి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నాను. ఇప్పుడు ఒక్కరికే తల్లికి వందనం ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఇలా అయితే ఫీజులెలా కట్టగలం. ప్రభుత్వం పిల్లలందరికీ పథకం వర్తింపజేయాలి.
– జగుశెట్టి జ్యోతి, నేరడి–బి, భామిని మండలం

చదివించడం భారమే..



మధ్య తరగతి కుటుంబానికి చెందిన మేము రెక్కల కష్టంపై బతుకుతున్నాం. గత ప్రభుత్వం అందించే అమ్మఒడి నగదు మా పిల్లలు శ్యామ్‌బాబు, కౌశల్య చదువులకు వినియోగపడేవి. అప్పట్లో రూ.13 వేలు అందాయి. ప్రస్తుత ప్రభుత్వం ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు అమ్మకు వందనం పేరిట ఇస్తామన్నారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. పెద్దోడు 8వ తరగతి, పాప ఆరో తరగతి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. ప్రస్తుతం వారికి ఫీజులు, పుస్తకాలు, దుస్తులకు నగదు అవసరం. ఇతర ప్రాంతం నుంచి వచ్చి స్థానికంగా చిరు వ్యాపారం చేసుకుంటున్నాం. ఇద్దరి పిల్లల చదువుకు నగదు కేటాయించడం మాకు భారమే. ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం కచ్చితంగా అమలు చేయాలి.
దొడ్డ వెంకట లక్ష్మి, పాలకొండ మండలం.

అంతా మోసం..



నాకు ముగ్గురు పిల్లలు. గతంలో చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకం కింద ఒక్కో పిల్లవానికి రూ.15 వేలు చొప్పున మొత్తం ముగ్గురు పిల్లలకు కలిపి రూ.45 వేలు అందివ్వాలి. ఇప్పుడు ఒక్కరికే రూ.15 వేలు ఇస్తామని చెబుతుండడం అంతా మోసంలా ఉంది. నేటికీ ఆ పథకం అమలు ఎప్పుడు చేస్తారో కూడా తెలీదు.
–కె.జయలక్ష్మి, పూడేస్ గ్రామం, కొమరాడ మండలం.

ఉపాధి పనుల్లో పారదర్శకతకే సామాజిక తనిఖీలు

- డ్వామా పీడీ కె.రామచంద్రరావు



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

కొమరాడ: ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత పాటించాలన్న సదుద్దేశ్యంతోనే సామజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీలకు సంబంధించి, ప్రజావేదిక కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు మండలంలోని 32 పంచాయతీల్లో నిర్వహించిన పనుల్లో వేతనదారులు, మెటీరియల్ కోసం రూ.15,88,67,214 నిధులు, పంచాయతీరాజ్ ద్వారా 16 పనుల్లో రూ.1,85,70,270 నిధులు, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా రూ.13,43,38,126 నిధులు మొత్తం ఏడాది గాను రూ.31,17,75,610 నిధులను ఖర్చు చేశామని పేర్కొన్నారు. మస్టర్లలో వేతనదారుల సంతకాలు లేకపోయినా వేతనం మంజూరు చేయించిన సాంకేతిక, క్షేత్ర సహాయకులపై చర్యలు తీసుకుంటామన్నారు. లోపాలు గుర్తించిన చోట రికవరీలు చేయడం జరుగుతుందన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు లేనిచోట మొక్కలు ఖచ్చితంగా నాటాలని ఆదేశించారు. గ్రామాల్లో సామాజిక పింఛన్ల తనిఖీలు కూడా చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, ఎంపీడీవో మల్లికార్జునరావు, ఏపీవో వి.బాలకృష్ణ, ఎస్‌టీఎం సత్యనారాయణ, డీఆర్‌పీలు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, వేతనదారులు పాల్గొన్నారు.

పచ్చగడ్డితో పాల దిగుబడి



పశుగ్రాస వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

భామిని: పశువులకు ఇచ్చే మేతలో తప్పకుండా పచ్చగడ్డి వేయాలని పశు సంవర్ధక సహాయ సంచాలకుడు డాక్టర్ బి. శ్రీనివాస్ తెలిపారు. పచ్చగడ్డి వేయడం వల్ల పాల దిగుబడి పెరుగుతుందన్నారు. మండలంలోని ఘనసర రైతుసేవా కేంద్రంలో గురువారం నిర్వహించిన పశుగ్రాస వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులందరూ పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పశువైద్యాధికారి ఎం.సంతోష్‌కుమార్ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీఏఏ ఎం. లక్ష్మణరావు, బి. ప్రదీప్, వై.చంటి, ఎ. ఫాల్గుణరావు, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

16 నుంచి పారిశుధ్య కార్యక్రమాలు

సీతంపేట: ఈ నెల 16వ తేదీ నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ కె.గీతాంజలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ రాక

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్ శుక్రవారం ఐటీడీఏకు రానున్నట్లు అధికారవర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఫీల్డ్ విజిట్ చేయనున్నట్లు పేర్కొన్నాయి.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోండి

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ బి.గౌరీశంకరరావు కోరారు. మండల కేంద్రంలోని గడ్డి కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం-1ను ఆయన గురువారం సందర్శించి, గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని మనం తినే రోజువారీ ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వై.రేవతి, అంగన్‌వాడీ కార్యకర్త శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సరుకులు అందించాలి

ఆర్డీఓ వెంకటరమణ

పాలకొండ: వినియోగదారులకు నాణ్యమైన సరుకులు అందించాలని ఆర్డీఓ వెంకటరమణ అన్నారు. పట్టణంలోని షాపింగ్ మాల్స్ వద్ద ప్రభుత్వ సరుకుల దుకాణాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బియ్యం, కందిపప్పు తక్కువ ధరలకు అందించేందుకు ఈ షాపులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయనతో పాటు తహసీల్దార్ వరహాలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సందర్శన

సీతంపేట: మండలంలోని గొయిది గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ కె.గీతాంజలి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరును పరిశీలించారు. గ్రామాల్లో నీటి పరీక్షలు ఏ విధంగా చేస్తున్నారు, తదితర అంశాలపై చర్చించారు. గ్రామ సచివాలయ సేవలు మెరుగుపర్చాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు.

అభినందనలు

పాలకొండ రూరల్: పట్టణంలోని నీలమ్మకాలనీకి చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కె.జనార్దనరావు కుమారుడు మణికృష్ణ ఇటీవల ఫారెస్ట్ రేంజర్‌గా ప్రభుత్వ కొలువు దక్కించుకున్నారు. ఈ క్రమంలో మణికృష్ణను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

గర్భిణులకు అన్నదానం

జియ్యమ్మవలస: వైద్య తనిఖీల నిమిత్తం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి గురువారం విచ్చేసిన గర్భిణులకు సత్యసాయి భక్తులు అన్నదానం చేశారు. దాదాపు 80 మంది గర్భిణులకు పౌష్టికాహార పదార్థాలతో కూడిన ఆహారాన్ని అందించామని భక్తులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హీరాపంచమి..

- జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



సుభద్ర, బలబద్ర సమేత జగన్నాథస్వామి

వీరఘట్టం: జగన్నాథస్వామి రథోత్సవంలో భాగంగా గురువారం స్థానిక గుండిచ మందిరంలో హీరపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు లింగరాజ్ రథో ఆధ్వర్యంలో సుభద్ర, బలబద్ర సమేత జగన్నాథస్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామికి భోగాలు సమర్పించడంతో ఆలయ ప్రాంతం కిక్కిరిసిపోయింది. జై జగన్నాథ.. జై జై జగన్నాథ నామస్మరణతో ఆ ప్రాంతం పులకించిపోయింది.

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో హీరాపంచమి పూజలు గురువారం నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు జగన్నాథస్వామి దర్శనానికి పోటెత్తారు. రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా ఈ పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు.

ప్రత్యేక పూజలు

పాలకొండ: మండల కేంద్రంలోని జగన్నాథస్వామి ఆలయంలో హీరాపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగన్నాథస్వామి వరాహ, నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వనాథం దాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, పాలకొండ జెడ్పీటీసీ సభ్యురాలు పాలవలస గౌరీపార్వతీ, రేగిడి జెడ్పీటీసీ సభ్యురాలు పాలవలస ఇందుమతి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, కౌన్సిలర్లు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ సర్వేశ్వరావు, తదితరులు ఏర్పాట్లు చేశారు.

– ప్రత్యేక పూజలు..

భామిని: మండలంలోని బత్తిలిలో గల రాధా బృందావన స్వామి మఠంలో హీరాపంచమిలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మఠం పీఠాధిపతి (పూరీ) శ్రీ మహంత్ మదన్ గోపాల్‌జీ పర్యవేక్షణలో హరేరామ నామ సంకీర్తన కొనసాగించారు. ఆలయ అర్చకులు ప్రతాప్‌చంద్ర సాహూ ఆధ్వర్యంలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పరిశీలన

- పలు ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన డీఈఓ

సీతంపేట: గిరిజన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ పరిశీలించారు. మండలంలోని సామరెల్లి, మల్లి, స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. అలాగే వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎ.భాస్కరరావు, టి.చంద్రరావు, ఏవీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

పాలకొండ రూరల్: వాహన చోదకులు తప్పకుండా నిబంధనలు పాటించాల్సిందేనని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ. విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, వ్యక్తిగత భద్రతపై వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈయన వెంట న్యాయవాదులు, బార్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో జైగురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ తదితర పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్.శర్మయాజీ ఆధ్వర్యంలో ప్రతీ గురువారం ఈ గురుదత్త హోమంను భక్తులతో చేయిస్తున్నారు. బాబా దర్శనానికి గరుగుబిల్లి, పెద్దూరు, హిక్కింవలస, ఉద్దవోలు, రావుపల్లి, బి.వి.పురం, కొత్తపల్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



షిర్డీసాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

పశుగ్రాసం పెంపకంపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రైతులకు పశుగ్రాసం పెంపకంపై పాడిరైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు పశుగ్రాసం ఏ విధంగా పెంచాలి, పశుగ్రాసం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆవులకు ఈ పశుగ్రాసం మేతగా వేయడం ద్వారా ఆవుల్లోపాలదిగుబడి పెరుగుతుందని, తద్వారా పాడిరైతులకు లాభం చేకూరుతుందన్నారు.

కురుపాం: మండలంలోని పూతికవలస గ్రామంలో పశుగ్రాస వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మ పశువైద్యాధికారిణి శైలజ పశు పోషకులకు వివిధ రకాల పశుగ్రాసాలు, వాటి సాగు, సంరక్షణ, వాటిలో ఉండే పోషకాలపై అవగాహన కల్పించారు.

త్వరలోనే రైతులకు 75 శాతం రాయితీపై పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కె.కొండయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: పశుగ్రాసం పెంపకంపై అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి లక్ష్మణరావు

గరుగుబిల్లి: రాయితీపై పశుగ్రాసం పంపిణీ చేయడం జరుగుతోందని, పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.మన్మధరావు కోరారు. మండలంలోని చిలకాం గ్రామంలో పశుగ్రాస వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ పెంచుతున్న పశుగ్రాసాన్ని ఆయన పరిశీలించి, ఆ పశుగ్రాసం ప్రయోజనాలను వివరించారు. ఈ పశుగ్రాసాన్ని పాడిపశువులకు వేయడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి, పశుపోషకులకు లాభం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.గంగమ్మ, ఎంపీటీసీ డి.సత్యనారాయణ, పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

భూ యజమానులు సహకరించాలి

వీరఘట్టం : తమ పొలాలను కౌలుకు చేస్తున్న రైతులకు భూ యజమానులు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి, ఆర్ఐ లక్ష్మునాయుడు అన్నారు. రుణఅర్హత కార్డులు మంజూరు చేసేందుకు దశుమంతపురం, సంత-నర్సిపురం, నడుకూరు, కొట్టుగుమ్మడ, గడగమ్మ, కిమ్మి, వండవ, అడారు, బిటివాడ, చేబియ్యంవలస, డెప్పివలస, తూడి, పీవీఆర్ పురం, చిదిమి, యు.వెంకమ్మపేట, పాలమెట్ట రెవెన్యూ గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.



బిటివాడలో గ్రామసభ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

గుణాత్మక విద్యనందించండి

- గిరిజన సంక్షేమశాఖ డీడీ రుక్మాంగధరరావు



మాట్లాడుతున్న డీడీ రుక్మాంగధరరావు

సీతంపేట: విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ రుక్మాంగధరరావు అన్నారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎంలు, వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన విద్యాసంస్థల్లో మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు ఉండేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన మెరుగయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నారాయుడు, ఎంఈఓ ఆనందరావు, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, జీసీడీఓ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణలో భాగస్వాములు కావాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణను పాటిస్తూ జనాభా నియంత్రణలో భాగస్వాములు కావాలని తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి అభిలాష్ కోరారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండలంలోని తాడికొండ గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో జనాభా రోజురోజుకూ పెరుగుతోందని, జనాభా పరంగా భారతదేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో జనాభా పెరుగుదలను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దంత వైద్యురాలు పావని, పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. జనాభా పెరగడానికి గల కారణాలు, జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాలు, కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యుడు జగదీష్ పాల్గొన్నారు.

దేశ జనాభా మన బలం..

పాలకొండ రూరల్ : దేశంలో పెరుగుతున్న జనాభా ఆ దేశానికి బలమని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యామ్‌బాబు అన్నారు. జాతీయ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని అర్థశాస్త్ర విభాగం నేతృత్వంలో అధ్యాపకురాలు బి.శాంతి గురువారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనాభా క్రమపద్ధతిలో పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ జయమణి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తింపుకార్డులు తప్పనిసరి

గుమ్మలక్ష్మీపురం: పొలం కౌలుకు తీసుకుని, సాగు చేసే ప్రతీ రైతు రెవెన్యూ శాఖ అందిస్తున్న కౌలురైతు గుర్తింపుకార్డు(సీసీఆర్‌సీ) తప్పనిసరిగా తీసుకోవాలని ఏవో సీహెచ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని కేదారిపురం గ్రామంలో కౌలురైతులతో గురువారం సమావేశమైన ఆయన.. గుర్తింపుకార్డుల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. గుర్తింపుకార్డులు ఉన్న వారికే సాధారణ రైతుల మాదిరి ప్రభుత్వం రాయితీపై ఇచ్చే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఇవ్వడం జరుగుతోందని, అలాగే పంట నమోదు చేసి, ప్రభుత్వం కల్పించిన మద్దతుధరకు పంట విక్రయించుకునేలా వెసులుబాటు ఉంటుందని తెలిపారు. గుర్తింపుకార్డు కావాలనుకునే వారు పొలం సొంత రైతు పాస్‌పుస్తకం/1బి జిరాక్స్, సొంత రైతు ఆధార్‌కార్డు జిరాక్స్, కౌలురైతు ఆధార్‌కార్డు జిరాక్స్, కౌలురైతు పాస్ ఫొటోలు 3, కౌలురైతు గుర్తింపుకార్డులు దరఖాస్తుతో పాటు రెవెన్యూ అధికారులకు గానీ, వీఏఏలకు గానీ ఇవ్వాలన్నారు.

గరుగుబిల్లి: కౌలురైతు గుర్తింపుకార్డు ఉంటేనే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని స్థానిక సర్పంచ్ కె.ఇందుమతి తెలిపారు. మండల కేంద్రంలో కౌలురైతులతో గురువారం సమావేశమైన ఆమె.. కౌలురైతు గుర్తింపుకార్డు ఏ విధంగా పొందవచ్చో తెలిపారు. అలాగే గుర్తింపుకార్డు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.